క్లుప్తంగా

ఉద్యమాల గడ్డ బుచ్చి, దామరమడుగు



మాట్లాడుతున్న మూలం రమేష్

బుచ్చిరెడ్డిపాళెం : ప్రజా ఉద్యమాల గడ్డ బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగు గ్రామాలు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ముఖ్యంగా భూ పోరాటాల ద్వారా అర్హులైన వారికి భూమిని అందించే విషయంలో ఈ రెండు గ్రామాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. రానున్న కాలంలో మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపట్టి ప్రజల పక్షాన నిలబడుతామని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం విధానంలో గ్రామాల్లో బెల్ట్ షాపులు అధికంగా వచ్చే అవకాశం ఉందని, వీటిపై కూడా పోరాటాలు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలపై దెబ్బ కొడుతున్నాయని, కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో తాగునీరు, పారిశుద్ధ్యం, కార్మికుల జీతాల విషయంలో సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి కూడా తమ పార్టీ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, మాదాల వెంకటేశ్వర్లు, తుళ్లూరు గోపాల్, ముత్యాల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

రూ.1000 ఇస్తేనే ఉచిత ఇసుక

- మినగల్లులో టీడీపీ నాయకుల అక్రమ వసూళ్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సీఎం చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నామని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. మండలంలోని మినగల్లు ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్లతో ఇసుక తోలుకుంటున్న వారి నుంచి స్థానిక టీడీపీ నాయకులు కోటంరెడ్డి సురేష్‌రెడ్డి, రాము రూ.1000 ఇవ్వాల్సిందేనని దౌర్జన్యానికి దిగుతున్నారు. 'మేము స్థానికులం, ప్రభుత్వం ఉచితంగా ఇసుక తోలుకోవచ్చని చెప్పినా మీరు అక్రమ వసూళ్లు చేస్తున్నారేంటి' అని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు తెగపడుతున్నారు. మినగల్లు రీచ్ నుంచి ఇసుక ఎత్తుకుపోవాలంటే రూ.వెయ్యి ఇవ్వాల్సిందేనని, లేకపోతే అనుమతి ఇచ్చేది లేదని ట్రాక్టర్ డ్రైవర్లను బెదిరిస్తున్నారు. చేసేది లేక వారు అడిగిన నగదు చెల్లించి కొందరు ఇసుక తీసుకెళ్తున్నారు. నగదు చెల్లించనివారు వెనుదిరుగుతున్నారు.

రాత్రుళ్లు టిప్పర్లతో ఇసుక రవాణా

మినగల్లు రీచ్‌లో రాత్రుళ్లు టిప్పర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. భారీ వాహనాలు, ప్రొక్లెయిన్లు వాడకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని పట్టించుకోకుండా టీడీపీ నాయకులు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ రూ.లక్షల నగదును అక్రమంగా సంపాదిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లును వివరణ కోరగా రాత్రుళ్లు టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై నిఘాపెట్టి చర్యలు తీసుకుంటామని వివరించారు.

గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలి

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగే సన్మాన కార్యక్రమానికి బదిలీపై వెళ్లిన మండల స్థాయి అధికారులతో పాటు గ్రామస్థాయి అధికారులూ హాజరు కావాలని ఎంపీపీ గాలి జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బదిలీపై వెళ్లిన గ్రామస్థాయి అధికారులకు సన్మానం ఉంటుందన్నారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై మండలానికి వచ్చిన గ్రామస్థాయి అధికారులు కూడా హాజరు కావాలన్నారు. వీరితో పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు మోటార్‌బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు సమాచారాన్ని సంగం ఎస్సై రాజేష్‌కు తెలిపారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆటోలో వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితులు తరలివెళ్లారు.

డబ్బు కొట్టు.. బెల్టుషాపు పట్టు



గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మద్యం దుకాణం



చెముడుగుంట సమీపంలో ఉన్న మద్యం దుకాణం

- టీడీపీ నేతలకు మాత్రమే బేరాలు
- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టుషాపులు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుతో గ్రామాల్లో వీధికో బెల్టు షాపు ఏర్పాటు చకచకా జరిగిపోతున్నాయి. వీటి కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోటీ పడుతుండడంతో మద్యం షాపుల నిర్వాహకులకు వరంగా మారింది. గ్రామానికో రేటు నిర్ణయించి అడ్వాన్స్ చెల్లించిన వారికి బెల్టు షాపు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు ఏర్పాటవుతున్నా ఎక్సైజ్, పోలీస్ శాఖ పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 28 ప్రైవేటు మద్యం దుకాణాలు వెలిశాయి. వెంకటాచలంలో 6, పొదలకూరులో 6, ముత్తుకూరులో 8, మనుబోలులో 3, తోటపల్లిగూడూరు మండలంలో 5 మద్యం షాపులను లాటరీలో దక్కించుకున్న నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే నిన్నటి వరకు మద్యం షాపుల పక్కనే కూల్‌డ్రింక్స్ దుకాణాల ఏర్పాటు కోసం ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకుల మధ్య పోటీ జరిగింది. ఈ విషయంలో కొన్నిచోట్ల టీడీపీ నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. కూల్‌డ్రింక్స్ షాపుల పంచాయితీ ముగిసిందిలే అనుకుంటే తాజాగా బెల్టుషాపుల పంచాయితీ మద్యం షాపు నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. మా వర్గానికే బెల్టు షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సిందేనంటూ ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులు పోటాపోటీగా మద్యం షాపు నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నారు. కొందరు ఎవరి అనుమతులు తీసుకోకుండానే ఇప్పటికే తమకు నచ్చిన మద్యం షాపు నుంచి మద్యం బాటిళ్లు తీసుకువచ్చి బెల్టు దుకాణాలు తెరిచేశారు.

రూ.10 వేలు చెల్లిస్తేనే బెల్టుషాపునకు అనుమతి

నియోజకవర్గ పరిధిలోని 28 మద్యం దుకాణాల పరిధిలో బెల్టు షాపులను తెరిచేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు విపరీతంగా ఎగబడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎవరి అనుమతులు లేకుండా బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసి బహిరంగంగా అమ్ముతున్నారు. బెల్టు దుకాణం ఏర్పాటుకు ప్రతి గ్రామం నుంచి నలుగురు నుంచి ఎనిమిది మంది వరకు పోటీ పడుతుండటంతో మద్యం దుకాణాల నిర్వాహకులకు వరంగా మారింది. బెల్టుషాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటే రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మద్యం బాటిల్‌ను ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.10లు పెంచి బెల్టుషాపులకు సరఫరా చేస్తామని చెబుతున్నారు. సర్వేపల్లి గ్రామంలోని మద్యం దుకాణం పరిధిలో ఉన్న గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా రూ.10 వేలు చెల్లిస్తేనే అనుమతిస్తామని చెబుతున్నట్లు బెల్టు షాపులను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్న వ్యక్తులు బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. కాగా బెల్టు షాపు నిర్వాహకులు రూ.150 ఎమ్మార్పీ ఉన్న క్వార్టర్ బాటిల్‌ను బెల్టులో రూ.200లకు అమ్ముకుంటున్నారు.

అధికారుల చర్యలేవీ?

సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసిన వెంటనే గ్రామాల్లో బెల్టు షాపులు అంతే వేగంగా తెరుచుకున్నాయి. కొన్ని గ్రామాల్లో నేతల మధ్య ఉన్న పోరు కారణంగా పోటాపోటీగా బెల్టు షాపులు తెరుచుకున్నాయి. నిబంధనల ప్రకారం బెల్టు షాపులు ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకమైనా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కొన్ని గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా బెల్టు షాపులలో మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మహిళలు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రామాల్లో బెల్టు దుకాణాలు లేకుండా చర్యలు చేపట్టకపోతే మహిళలు రోడ్డెక్కుతామని హెచ్చరిస్తున్నారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం మండల కేంద్రంలో సీపీఎం మండల నూతన కమిటీని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గండవరపు శ్రీనివాసులు, సభ్యులుగా గరికపాటి సురేష్, పుత్తేటి మల్లికార్జున, పోతింశెట్టి శ్రీనివాసులు, చల్లకొలుసు మల్లికార్జున, మునుస్వామి, మద్దిశెట్టి సురేష్, నన్నం మాధవయ్య, రేకులగుంట అంకయ్య, అన్నె సురేష్, వెంకటరమణయ్య ఎన్నికయ్యారు.

పాటూరులో గ్రామసభ నేడు

కోవూరు : మండలంలోని పాటూరు గ్రామంలో బుధవారం రెవెన్యు గ్రామసభ జరుగనుందని తహసీల్దార్ నిర్మలానందబాబా మంగళవారం తెలిపారు. గ్రామంలో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామసభల్లో తెలుపుకోవచ్చని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలేరమ్మకు పొంగళ్ల సమర్పణ



పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో పోలేరమ్మ తల్లికి మహిళలు మంగళవారం పొంగళ్లు పెట్టుకున్నారు. చాలాకాలం తర్వాత పొంగళ్ల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామపెద్దలు వెల్లడించారు. గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని మేళతాళాలు, బాణసంచాతో ఊరేగింపుగా మహిళలు పోలేరమ్మ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లను సమర్పించారు.

శ్మశానవాటికలో క్లీన్ అండ్ గ్రీన్

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలోని శ్మశానవాటికలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. శ్మశానవాటిక ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు పెరిగిపోయి, ఎగుడు దిగుడుగా ఉండడంతో అపరిశుభ్రంగా మారింది. దీంతో అంత్యక్రియలకు ఇబ్బందిగా ఉండేది. దీనిపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది అడ్డదిడ్డంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, కత్రతుమ్మ చెట్లను జేసీబీతో తొలగించారు. ఎగుడు దిగుడుగా ఉన్న నేలను చదును చేశారు. పనులను పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, వీఆర్వో నాగార్జురెడ్డి పర్యవేక్షించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న జేసీబీ

లాభాల బాటలో పేడూరు సొసైటీ

తోటపల్లిగూడూరు : మండలంలోని పేడూరు సహకార వ్యవసాయ పరపతి సంఘం లాభాల బాటలో పయనిస్తున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ అధికారి గుర్రప్ప అన్నారు. ఈ మేరకు ఆయన పేడూరు సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేడూరు సొసైటీ లాభాల బాటలో నడుస్తూ కంప్యూటరైజేషన్ దిశగా కదులుతోందన్నారు. ఈ క్రమంలో సొసైటీకి అన్ని వసతులు సమకూరాయన్నారు. అభివృద్ధి చెందుతున్న సొసైటీకి అనుబంధంగా వ్యవసాయ గిడ్డంగిని స్థానిక రైతులు కోరారని, అనువైన స్థలం దొరికిన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే జీవన ఎరువులు, నానో యూరియా వినియోగంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ మహాజన సభ సంఘ పర్సన్ ప్రకాష్, మండల ఏఓ శిరీషారాణి, సొసైటీ సీఈఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా సహకార బ్యాంక్ అధికారి గుర్రప్ప

భూ సమస్యలకు వేగంగా పరిష్కారం



కొడవలూరు : వినతి పత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ స్ఫూర్తి



మనుబోలు : తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న రైతులు

- తహసీల్దార్ కె.స్ఫూర్తి

కొడవలూరు : భూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.స్ఫూర్తి తెలిపారు. మండలంలోని రామన్నపాళెంలో రీసర్వే సమస్యలపై మంగళవారం జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొని, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభల్లో తెలిపిన భూ సమస్యలను విధిగా 15 రోజుల్లోనే పరిష్కరిస్తామని చెప్పారు. ముందుగా నిర్దేశించిన తేదీలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రీసర్వేలో సమస్యలుంటే ఏ రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో విధిగా గ్రామసభను ఏర్పాటు చేసి రీసర్వే సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, రీసర్వే డీటీ అరుణకుమార్, ఆర్ఐ సునీల్‌కుమార్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, గ్రామ సర్వేయర్ పోకూరి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేపై అర్జీల స్వీకరణ

మనుబోలు : మండలంలోని గురివిందపూడి గ్రామంలో రీసర్వే సమస్యలపై మంగళవారం జరిగిన గ్రామసభలో బాధిత రైతుల నుంచి 38 అర్జీలు అందినట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రీసర్వే డీటీ మంజుల, వీఆర్వో ఖాదర్‌బాషా, సర్వేయర్ శ్రీనివాసులు, సచివాలయ సర్వేయర్ వంశీ, టీడీపీ నాయకులు చెన్నూరు సుధీర్‌రెడ్డి, సర్వేపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం

- గ్రామాల్లో పొలం పిలుస్తోంది

కొడవలూరు : రైతులు విత్తన శుద్ధి పాటించడం వల్ల తొలిదశలో సోకే తెగుళ్లను తట్టుకునే శక్తి ఉంటుందని కోవూరు ఏడీఏ డి.సుజాత తెలిపారు. మండలంలోని రామన్నపాళెం, ఆలూరుపాడుల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి వల్ల అనేక రకాల తెగుళ్లను దూరం చేయవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై పంపిణీకి కేఎస్ఎం 1638 రకం వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొడవలూరు పశు వైద్యాధికారి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పశువులలో వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా చేయించాలని సూచించారు. అనంతరం రామన్నపాళెంలో సాగులో ఉన్న నవధాన్యాల పంటను ఏడీఏ సుజాత పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి, ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు కె.పృథ్వీ, ఆర్.నిహారిక, వీపీఏలు పి.హరినాథ్, సుప్రియ పాల్గొన్నారు.

చౌడు భూములపై శ్రద్ధ చూపాలి

ముత్తుకూరు : వ్యవసాయానికి పనికిరాని చౌడు భూములపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జోత్స్నరాణిలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, చౌడు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. చౌడు భూముల్లో పచ్చరొట్ట పైర్లను సాగు చేయాలన్నారు. ఇదే విధంగా జిప్సం వినియోగం ద్వారా చౌడును నివారించవచ్చని సూచించారు. రబీ సీజన్‌కు అనుకూలమైన విత్తనాలను వివరించారు. వీఏఏ కరీమ్, ఏఈఓ దేవరాజ్ పాల్గొన్నారు.



కొడవలూరు : ఆలూరుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

తెగుళ్లను తట్టుకునే విత్తనాలు విత్తండి

పొదలకూరు : రైతులు తెగుళ్లను తట్టుకునే విత్తనాలు విత్తాలని ఏఓ వాసు సూచించారు. మండలంలోని మరుపూరు, బిరదవోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై మాట్లాడారు. మినుములో వీబీఎన్–8 అనే రకం పేనుబంక, తెల్లదోమ తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. కొత్తరకం విత్తనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ప్రతిరైతుకు నాలుగు కిలోల మినుముల విత్తనాల సంచిని ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వెటర్నరీ డాక్టర్ దానియేలు, ఆయిల్‌ఫామ్ కో–ఆర్డినేటర్ వినయ్, ఏఈఓ ఏడుకొండలు, వీఏఏ సాయి గణేష్, వీహెచ్ఏ విజిత, రైతు సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

విడవలూరు : రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని ఊటుకూరు, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీటీ–5204, కేఎస్ఎం–1638 రకాల విత్తనాలు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుత వర్షాకాలంలో రైతులు అనుకూల పరిస్థితుల్లో నారుమడులు వేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏలు బి.కామాక్షి, పి.ప్రవీణ్ పాల్గొన్నారు.



పొదలకూరు : మాట్లాడుతున్న ఏఓ వాసు

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు : వరిసాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని వరకవిపూడి, మాచర్లవారిపాళెం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులతో భూసారం నశించి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిలో పచ్చిరొట్ట విత్తనాలైన సేంద్రియ ఎరువులను వినియోగించడం ఉత్తమమన్నారు. సాగుకు ముందు విత్తన శుద్ధి చేపడితే చీడపీడలను నివారించవచ్చన్నారు. అలాగే నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక వరకవిపూడి పంచాయతీ పరిధిలోని పంట పొలాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల ఏఓ శిరీషారాణి, వీఏఏలు విద్యాసాగర్, వైష్ణవి, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ముత్తుకూరు : చౌడు భూములను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



విడవలూరు : క్షేత్రస్థాయిలో అధికారులు, రైతులు



తోటపల్లిగూడూరు : వరకవిపూడి గ్రామంలో..